క్లుప్తంగా

ఎన్నికైన నీటి సంఘ సభ్యులపై వేటు

సుండుపల్లె : మండల తిమ్మసముద్రం ఊట చెరువు ఎన్నికైన ఇద్దరు సభ్యులపై వేటు పడింది. శనివారం ఈ మేరకు జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నీటి సంఘం ఎన్నిక సంబంధించి అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ విచారణ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసిన తరువాత ఎన్నికల నియమావళిని అతిక్రమించారని కలెక్టర్ గుర్తించారు. ఎన్నిక కాబడినట్లు ప్రకటించిన నాలుగు, ఐదులకు ఎన్నికైనా సభ్యులు అబ్దుల్‌తవాబ్, ఖలీలుల్లాలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఊటచెరువు నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై న లగిశెట్టి రామాంజులు హైకోర్టులో ఉత్తర్వు ప్రకారం టీసీ మూడుగా కొనసాగుతారని కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పందిళ్లపల్లి గ్రామ కస్పాలో తాగునీటి ఉందని వెంటనే సమస్యను పరిష్కరించాలని రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు కోరారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. దర్బార్ పరానా, స్వప్న పాల్గొన్నారు.

పశువుల సంత వేలం వాయిదా

రామాపురం : మండల కేంద్రంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో పశువుల సంత, బస్టాండు గేటు వేలం పాటను శనివారం నల్లగుట్టపల్లె సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ఎక్కువగా ఉందని పాటదారులు వేలం పాట పాడకపోవడంతో ఈనెల 20వ తేదీ 3గంటలకు తిరిగి వేలం పాటను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

సుండుపల్లె : మండల పరిధిలోని భాగంపల్లె పంచాయతీ నల్లమేకలపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4 వేల నగదు, రెండు ద్విచక్రవాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే మడితాడు గ్రామ పంచాయతీ దిగువ నాయునివారిపల్లె సమీపంలో చిన్నచెరువు వద్ద జూదం ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.5,400 నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలి

రైల్వేకోడూరు అర్బన్ : శిక్షణ పొందిన ప్రతి మహిళ ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా సీఈఓ మైథిలి శనివారం తెలిపారు. గ్లోబల్ ట్రస్ట్ కార్యాలయంలో మూడురోజులుగా జరిగిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల శిక్షణ కార్యక్రమంలో మహిళలకు సర్టిఫికేట్‌లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ పార్థ సారథి, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఒంటిమిట్ట: మండలంలోని తప్పెటవారిపల్లిలో ఈనెల 12వ తేదీ జరిగిన ఘర్షణకు సంబంధించి బాధితుడు బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు శనివారం ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు తప్పెటవారిపల్లికి చెందిన బ్రహ్మయ్యకు అదే గ్రామానికి చెందిన చంద్రపాల్ అనే వ్యక్తికి మనస్పర్థల కారణంగా మార్చి 12న బ్రహ్మయ్యను చంద్రపాల్ వర్గానికి చెందిన వ్యక్తులు గాయపరిచారు. దీంతో గాయపడిన బ్రహ్మయ్య కడప రిమ్స్‌లో చికిత్స నిమిత్తం చేరాడు. చంద్రపాల్ వర్గానికి చెందిన 11 మందిపై ఫిర్యాదు చేయడంతో రిమ్స్ పోలీసుల సమాచారం మేరకు ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదు చేశారు.

ప్లాస్టిక్ భూతం.. అడ్డుకట్టతో ఆరోగ్యం

ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర



నందలూరు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

నందలూరు : ప్లాస్టిక్ భూతాన్ని అందరూ అడ్డుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా జీవించవచ్చని మండల స్పెషల్ ఆఫీసర్ రామచంద్ర నాయక్, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ రాధాకృష్ణంరాజు అన్నారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి మానవ హారం చేపట్టారు. సర్పంచ్ జంబు సూర్యనారాయణ, గ్రామ కార్యదర్శి సురేష్ కుమార్, ఈఓఆర్‌డీ సునీల్, ఎంఈఓ నాగయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణ, ఉపాధిహామీ ఏపీఓ మురళీ, సచివాలయ కార్యదర్శులు, ఉపాధిహామి సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే అంటువ్యాధులు దూరం

సిద్దవటం : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రగా ఉంచుకున్నప్పుడే అంటువ్యాధులు దూరమవుతాయని సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్యంపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

సుండుపల్లె : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ శేఖర్‌రెడ్డి తెలియజేశారు. స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం తన సిబ్బందితో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. విజయవాడ హెల్త్ ఎడ్యుకేటర్ కె.శివరామరాజు, పీహెచ్‌సీ డాక్టర్ రుబీనా, ఎంపీహెచ్‌ఈఓ వీరనారాయణ, సూపర్‌వైజర్ ఎల్లమ్మ, నరేష్, అనూష పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో స్వచ్ఛ ఆంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఎస్ఎస్ఎస్ పీఓ నాగ నవీన్‌కుమార్, సుబ్బరాయుడు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం

రాయచోటి : స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పోలీసుల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు శనివారం ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. అన్నమయ్య జిల్లా పోలీసులు, జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆవరణం, జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ పోలీసు అధికారుల కార్యాలయాల్లో పోలీసులు కలిసి వారి పరిధిలోని కార్యాలయాల ప్రాంగణాన్ని శుభ్రపరిచారు.

పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిదీ

రాయచోటి టౌన్ : పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మన చేతుల్లోనే ఉందని మాసాపేట సుగవాసి రాజారాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలసి పర్యావరణంపై అవగాహన కల్పించే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు జానకి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు శెట్టిం ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు జగదీశ్వరయ్య, మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉషారాణి, తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని మన రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దుకుందామని డిప్యూటీ తహసీల్దార్ కృపావతి పిలుపునిచ్చారు. శనివారం ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఐ సయ్యద్‌ఖాన్, వీఆర్ఓలు, వీఆర్ఏలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతలో ఆరోగ్యం

రైల్వేకోడూరు అర్బన్ : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా డిప్యూటీ సీఈఓ మైథిలి పేర్కొన్నారు. శనివారం శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక సర్పంచ్‌లు, అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ కోడూరుగా మార్చాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంతాల్లో వీధులు, రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని కడప అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం ముక్కావారిపల్లి పంచాయతీ, గొల్లపల్లి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ముక్కా రూపానందరెడ్డి, ఎంపీడీఓ మల్‌రెడ్డి, అధికారులు, సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి, నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

తడిపొడి చెత్త సేకరణపై అవగాహన

చిట్వేలి : స్వచ్ఛ ఆంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిట్వేలి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిలో ఉప సర్పంచ్ ఉమా మహేశ్వర్ రెడ్డి, కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం తడి పొడి చెత్తలను సేకరించి అవగాహన కల్పించారు. ఏపీఓ చంద్రకళ, పంచాయతీ సిబ్బంది నరసింహులు, వెంకటేష్, మస్తానయ్య, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పుల్లంపేట : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి సూచించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఏఓ శ్రీధర్ రెడ్డి, ఈఓపీఆర్‌డీ ముత్తయ్య, రామచంద్రారెడ్డి, బికె మణి తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : గ్రామాలలోని వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ విజయారావు ససూచించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బెస్తపల్లిలో చెత్తను తొలగించారు. చిట్వేలి రోడ్డు, పెనగలూరు రోడ్డులోని చెత్తను ఎక్సకవేటర్ ద్వారా తొలగించి పరిశుభ్రం చేశారు.



సిద్దవటం: పారిశుద్ధ్యంపై ఆసుపత్రి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్


చిన్నమండెం మోడల్ స్కూల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


రాయచోటి: జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో పరిశుభ్రం చేస్తున్న పోలీసులు


రాయచోటి టౌన్: మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు


రైల్వేకోడూరు అర్బన్: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సర్పంచ్‌లు

మండల సర్వసభ్య సమావేశం రసాభాస

- బిల్లులు మంజూరు చేయడం లేదని సర్పంచ్ ఆక్రోశం
- చేయని పనులకు బిల్లులు ఎలా చేయాలంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ


వాగ్వాదం చేసుకుంటున్న సర్పంచ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ బిల్లులు మంజూరు విషయంలో అధికారి, సర్పంచ్‌ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు హాజరై మండలంలో ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలు, పరిష్కారాలపై మాట్లాడారు. అయితే గొల్లపల్లి సర్పంచ్ దున్నుతుల లక్ష్మీ నారాయణ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తులసీరెడ్డి తాను చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఏడాది కిందట మూడు మోటార్లు చెడిపోతే వాటికి మరమ్మతులు చేయించానని, దీనికి సంబంధించి ఇంతవరకు తనకు ఎలాంటి బిల్లులు మంజూరు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తులసీరెడ్డి సమాధానమిస్తూ వారు పనులు చేసినట్లుగా తనకు ఎలాంటి స్పష్టతగానీ, లేఖగానీ, ఫొటోలు గాని ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గొల్లపల్లి సర్పంచ్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో విషయం స్థానిక పోలీసుల దృష్టికి వెళ్లగా, వారు సమావేశానికి ఏఎస్ఐని పంపడంతో వాగ్వాదం సర్దుమనిగి సమావేశం కొనసాగింది.

వెంటనే బిల్లులు పెట్టండి

సర్వసభ్య సమావేశంలో జరిగిన వాగ్వాదంపై ఎంపీడీఓ కేఆర్ ప్రసాద్‌ను వివరణ కోరగా ఆర్‌డబ్ల్యూఎస్ పనులు జరిగి ఉంటే జరిగిన పనులు వద్దకు వెళ్లి విచారణ చేసి వెంటనే బిల్లులు పెట్టమని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తులసీరెడ్డిని ఆదేశించడం జరిగిందన్నారు.

ఉత్తమ ఫలితాలతోనే ఉజ్వల భవిష్యత్తు

సిద్దవటం : కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, అప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సిద్దవటం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పట్టుదలతో మంచి మార్కులతో ఉత్తీర్ణులై.. ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్, మరెన్నో ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు సాధించ వచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

చిట్వేలి : చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు కేంద్రాలలో పది పరీక్షలు రాయనున్న విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారులు కోదండనాయుడు, ఈశ్వరయ్య శనివారం శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలోని ఏ కేంద్రంలో 245 మంది, బీ కేంద్రంలో 234 మంది, సీ కేంద్రంలో 160 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఎంఈఓలు తెలిపారు.

మార్కెట్ ప్లాట్‌ఫారమ్‌లను రెన్యువల్ చేయండి

రాయచోటి అర్బన్ : కూరగాయల మార్కెట్‌లో అధికారులు తమకు కేటాయించిన ప్లాట్‌ఫారం గడువు ముగిసిందని, వెంటనే వాటిని రెన్యువల్ చేయాలని వ్యాపారులు మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. వ్యాపారులు మాట్లాడు తూ మార్కెట్‌లో కూరగాయాలను విక్రయించే ఒక్క ప్లాట్‌ఫారంను నెలకు రూ.880 లు అద్దెను చెల్లించేలా నిర్ణయిస్తూ తమకు కేటాయించారన్నారు. డిసెంబర్ మాసానికి తమకు ఇచ్చిన కాలపరిమితి ముగిసినప్పటికీ అధికారులు అద్దెను పెంచడంతో పాటు ప్లాట్‌ఫారమ్‌లను తమకే కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేయలేదని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు : మండలంలోని మోడల్ స్కూల్‌కు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు దరఖాస్తులు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సహజబ్లెస్సీ తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని, పదోతరగతి పరీక్ష రాసే విద్యార్థులు ఈ నెల 17వ తేదీ నుంచి 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కమనీయం.. కల్యాణం


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం ఉదయం సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. కల్యాణ ఉభయదారులుగా భారతాల శ్రీధర్ బాబు యాదవ్, సుప్రియ దంపతులు వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, గడికోట వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ భువన శివశంకర్ రెడ్డి, గీతాల నరసింహారెడ్డి, అరిగెల సౌమిత్రి, పునగాని గుణ యాదవ్, గుండు మల్లికార్జున రెడ్డి, విజేయుడు, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా జాతర మహోత్సవం

వీరబల్లి: మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీని మాదిరెడ్డిగారిపల్లి వద్ద వెలసి ఉన్న వీరనాగమ్మ జాతర మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి పాల్గొని వీరనాగమ్మ దేవతకు పూజలు చేశారు. స్థానిక మండల నాయకులు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, మదన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ


విద్యార్థినికి పరీక్షా సామగ్రి అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

రాయచోటి టౌన్ : రాయచోటి కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థునులకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా మహిళ అధ్యక్షురాలు పద్మ యాదవ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ యాదవ్, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర బాబు, ప్రిన్సిపాల్ బీవీ రమణ పాల్గొన్నారు.

సంబేపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరామమాజులు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21న చదువు పోరాడు నినాదంలో భాగంగా విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు శనివారం పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేశారు.

చిట్వేలి : మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మండలంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఏబీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యాయుడు నరసారామయ్య, మానవతా చైర్మన్ తిరుమల విశ్వనాథం, అధ్యక్ష, కార్యదర్శులు మునిరావు, సాయిరాం, సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

రాయచోటి అర్బన్ : విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ఆలోచనను విరమించుకుని సెయిల్‌లో విలీనం చేయాలని ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి సాంబశివ డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రులు హక్కు విశాఖ ఉక్కు అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ కార్మికులు వీరోచితంగా ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాణ త్యాగం ఫలితంగా ఏర్పడిందన్నారు. ఈ ప్లాంట్‌కు వేలాది ఎకరాల భూములు రైతులు ఇచ్చారని తెలిపారు. అలాగే రాష్ట్రంలో ఆర్థికంగా, ఉద్యోగ, ఉపాధి పరంగా వెన్నుముకలా నిలిచిన స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజలు ఆస్తిని కార్పొరేట్ దోపిడీదార్లకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం కుట్రపన్నుతోందని తెలిపారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలీంబాషా, రాయచోటి తాలుకా కార్యదర్శి బత్తల వెంకటరమణ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

రాయచోటి జగదాంబసెంటర్ : వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరమని వాణిజ్య శాస్త్ర విభాగం అధ్యాపకులు యు. ప్రసాద్ అన్నారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. మునియానాయక్ మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. అవగాహనతోనే కొనుగోలు చేసుకోవాలని పేర్కొన్నారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు ప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులకు వస్తు సేవల కొనుగోలు విషయంలో ఏవైనా నష్టాలు, మోసాలు జరిగితే కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.